సాక్షి
అనకాపల్లి
శనివారం । 16 । సెప్టెంబర్ । 2023



ఆత్మీయ సత్కారం

అగనంపూడి: పదోన్నతిపై వెళ్లిన పూర్వ డీఆర్‌ఎం అనూప్ కుమార్ సత్పతిని రైల్వే యూజర్స్ అసోసియేషన్ సత్కరించింది.



ముగిసిన శ్రావణలక్ష్మి పూజలు

విశాఖ: కనకమహాలక్ష్మి దేవస్థానంలో శ్రావణలక్ష్మి పూజలు శుక్రవారంతో ముగిశాయి. మహాపూర్ణాహుతి నిర్వహించారు.

స్వల్ప వర్షసూచన

అనకాపల్లి టౌన్: రాగల నాలుగు రోజులు స్వల్ప వర్షసూచన ఉందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంజీజీఎస్ కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16న 1 మి.మీ., 17న 2, 19న 2, 20న 12 మి.మీ చొప్పున వర్షపాతం నమోదవుతుందని, ఉష్ణోగ్రతలు 33.4 నుంచి 33.8 డిగ్రీలు నమోదవుతాయన్నారు.

న్యూస్‌రీల్

కొత్తకోటలో భారీ గణపతి

- 30 అడుగుల విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు



సిద్ధమవుతున్న 30 అడుగుల భారీ వినాయక విగ్రహం

రావికమతం: ఈ ఏడాది వినాయక చవితి పండగ రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి ప్రత్యేకం కానుంది. ముందెన్నడూ లేని విధంగా గ్రామంలో 30 అడుగుల భారీ వినాయక విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. గడచిన కొన్నేళ్లుగా వినాయక నవరాత్రి మహోత్సవాలను ఏటా ఘనంగా నిర్వహించే స్థానిక శివాలయం వీధి సిద్ధి వినాయక యూత్ కుర్రాళ్లు.. ఈ ఏడాది భారీ విగ్రహం ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే అన్ని హంగులు పూర్తయ్యాయి. కోల్‌కతా నుంచి నలుగురు కళాకారులు వచ్చారు. కొత్తకోటకు చెందిన విగ్రహ శిల్పి నక్కా రాజు వారి సహాయంతో రెండు నెలలుగా ఈ విగ్రహం తయారు చేస్తున్నారు. 95 శాతానికిపైగా పనులు పూర్తయ్యాయని తెలిపారు.

బీమా అమలులో ఉన్నందున పరిహారం చెల్లించాలి

విశాఖ లీగల్ : బీమా అమలులో ఉన్నందున వ్యక్తి మృతి చెందితే రావలసిన పరిహారాన్ని చెల్లించాలని వినియోగదారుల మండలి న్యాయమూర్తి జి వెంకటేశ్వరి, సభ్యులు పి.విజయ దుర్గ,కే.రమణ బాబులు తీర్పునిచ్చారు. బీమా నిబంధనల ప్రకారం మృతుని కుటుంబానికి రూ.5 లక్షలు బీమా సొమ్ము, రూ.లక్ష నష్టపరిహారం, రూ.10 వేలు ఖర్చులు ఇవ్వాలని న్యాయమూర్తి ఆ తీర్పులో పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. వినియోగదారుడు కర్రి రమణబాబు అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండల పరిధిలోని ఔరాడ గ్రామ నివాసి. 2016లో ఏవీఎన్ కళాశాల దగ్గర ఆంధ్ర బ్యాంకులో ఇండియా ఫస్ట్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్నాడు. కొన్ని వాయిదాలు చెల్లించాడు. బీమా తీసుకొని కొన్ని నెలలకే అస్వస్థతతో మృతి చెందాడు. బీమా సౌకర్యం ఉన్నందున తమకు పూర్తి పరిహారం రూ.5 లక్షలు ఇవ్వాలని రమణ బాబు భార్య ఫోరమ్‌ను ఆశ్రయించారు. ఫస్ట్ ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ముంబాయి, విశాఖపట్నం కార్యాలయం, ఆంధ్రా బ్యాంక్ సంయుక్తంగా పరిహారం చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు అయినా బీమా కంపెనీ పట్టించుకోలేదు. దీంతో ఫిర్యాదు తరఫున న్యాయవాది ఆడారి అప్పారావు శుక్రవారం అమలు పిటిషన్ దాఖలు చేశారు.

సింహాచలం దేవస్థానం ఈవోగా శ్రీనివాసమూర్తి



శ్రీనివాసమూర్తి

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈవోగా డిప్యూటీ కలెక్టర్ ఎస్. శ్రీనివాస మూర్తిని నియమిస్తూ రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్.కరికల్ వలవెన్ శుక్రవారం జీవో జారీ చేశారు. ఇప్పటివరకు విశాఖ డీఆర్వోగా పనిచేసిన శ్రీనివాసమూర్తిని సింహాచలం దేవస్థానం ఈవోగా నియమిస్తూ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి ఈనెల 5న ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. దీంతో రెవెన్యూశాఖకి చెందిన శ్రీనివాసమూర్తి ప్రభుత్వానికి రిపోర్టు చేశారు. ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు.

అందాల పొదరిల్లు..

చకచకా తుది మెరుగులు



సుందరంగా తీర్చిదిద్దిన గృహాల అంతర్గత భాగం

- పంపిణీకి సిద్ధమవుతున్న టిడ్కో గృహాలు
- శరవేగంగా మౌలిక వసతుల కల్పన
- 2,160 మందికి చేకూరనున్న లబ్ధి



టిడ్కో గృహాల సముదాయంలో రూపుదిద్దుకుంటున్న అంతర్గత రహదారులు

నర్సీపట్నం: అంతర్గత రహదారులు.. రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీలు.. టైల్స్‌తో మెరిసిపోతున్న ఫ్లోరింగ్.. ఇళ్లలో సకల సౌకర్యాలు.. టిడ్కో గృహాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది లబ్ధిదారులకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. కోట్లాది రూపాయలు వెచ్చించి ఇళ్లకు తుది మెరుగులు దిద్దుతున్నారు. మౌలిక వసతుల కల్పన పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. జిల్లాలో నర్సీపట్నం, యలమంచిలి మున్సిపాలిటీల్లో జీ+3 టిడ్కో గృహాల నిర్మాణం జరిగింది. అక్టోబర్‌లో గృహాలు పంపిణీ చేయాల్సి ఉండడంతో మౌలిక వసతుల పనులను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేసే పనిలో టిడ్కో ఇంజినీరింగ్ విభాగం నిమగ్నమైంది.

జిల్లాలో నర్సీపట్నం టౌన్‌లో 1824, యలమంచిలి పట్టణంలో 2,160 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయి. లబ్ధిదారుల ఆర్థిక స్థోమతను బట్టి వీటిని మూడు రకాలుగా విభజించారు. రెండు మున్సిపాలిటీల్లో 399 మంది లబ్ధిదారులకు 300 చదరపు అడుగుల ఫ్లాట్లను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. లబ్ధిదారులకు ఫ్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ 60 నుంచి 70 శాతం పూర్తయిందని మున్సిపల్ అధికారులు చెప్పారు.



టైల్స్‌తో వంటగది ప్లాట్‌ఫామ్

రూ.23 కోట్లతో చకచకా పనులు

జీ+3 గృహాల వద్ద రూ.23 కోట్లతో రోడ్లు, అంతర్గత రహదారులు, సిమెంటు రోడ్లు అభివృద్ధి చేస్తున్నారు. డ్రెయిన్లు, ఓవర్‌హెడ్ ట్యాంక్, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు నిర్వహిస్తున్నారు. గత ఎన్నికల ముందు నిర్మాణంలో ఉన్న భవనాలను చూపించి జీ+3 గృహాలు ఇస్తున్నామని టీడీపీ నాయకులు ప్రజలను మోసగించారు. భవన నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నప్పటికీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు గృహాలు ఇచ్చేస్తున్నామంటూ లాటరీ తీశారు. టీడీపీ ప్రభుత్వంలో కాంక్రీట్ పనులు మాత్రమే చేయగా ప్రస్తుత వైఎస్సార్‌సీపీ సర్కార్ ఇళ్లలో టైల్స్, ప్లంబింగ్, ఫినిషింగ్ తదితర పనులు పూర్తి చేసింది.

అక్టోబర్ నెలాఖరుకు గృహాల పంపిణీ



జీ+3 గృహాలకు మౌలిక వసతుల కల్పన పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అక్టోబర్ నెలాఖరునాటికి లబ్ధిదారులకు గృహాలు పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాం. లబ్ధిదారుల పేరున ఫ్లాట్ల రిజిస్ట్రేషన్ 70 శాతం పూర్తయింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు లబ్ధిదారులకు గృహాలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

–కనకారావు, మున్సిపల్ కమిషనర్, నర్సీపట్నం

సీఎం జగన్‌కు ఘన స్వాగతం



ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, విశాఖ కలెక్టర్ మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం: విజయనగరం జిల్లా పర్యటనలో భాగంగా విశాఖ ఎయిర్‌పోర్టుకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంత్రులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం 9.45 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకున్న సీఎం హెలికాప్టర్‌లో విజయనగరం జిల్లా ద్వారంపూడికి బయలుదేరి వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం 2.20 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం, వీడ్కోలు పలికిన వారిలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి సత్యవతి, గొడ్డేటి మాధవి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె. సుభద్ర, జిల్లా కలెక్టర్ డా ఎ. మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ ఎ.రవి శంకర్, జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఈర్లే అనురాధ, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ ఉన్నారు. ముఖ్యమంత్రి 2.28 గంటలకు విమానంలో విజయవాడకు తిరుగు పయనమయ్యారు. ముఖ్యమంత్రి వెంట విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తదితరులు ఉన్నారు.

24 నుంచి సింహగిరిపై పవిత్రోత్సవాలు

- అన్ని ఆర్జిత సేవలు రద్దు
- రాత్రి 7 గంటల వరకు మాత్రమే దర్శనాలు



సింహాచలం : సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు పవిత్రోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు శుక్రవారం తెలిపారు. ఏడాదంతా స్వామికి జరిగే నిత్య సేవలు, విశేష సేవలు, ప్రముఖ ఉత్సవాల రోజుల్లో వైదికపరంగా ఏమైనా దోషాలు ఉంటే వాటిని నివృత్తి చేసేందుకు పవిత్రోత్సవాలను నిర్వహించడం పరిపాటిగా వస్తోందని తెలిపారు. దీనిలో భాగంగా 24వ తేదీ రాత్రి 7గంటల తర్వాత మృత్యం గ్రహణం, అంకురార్పణం, హోమాలు, 25వతేదీ ఉదయం విశేష హోమాలు, పారాయణాలు, రాత్రి అధివాసములు, పారాయణాలు, 26వ తేదీ రాత్రి పవిత్ర సమర్పణ, 27 ఉదయం విశేష హోమాలు, రాత్రి పూర్ణాహుతి, పవిత్ర విసర్జన, రథబలి, 28 ఉదయం ఏకాంత స్నపనం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేంపజేసి వేద పారాయణలు, దివ్యప్రబంధ సేవాకాలం, తిరువీధి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. పవిత్రోత్సవాల సందర్భంగా ఈనెల 24వ తేదీ నుంచి 28వతేదీ వరకు ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలు, నిత్యకల్యాణం రద్దు చేస్తున్నట్టు తెలిపారు. అలాగే ఈనెల 24నుంచి 28వరకు రాత్రి 7గంటల వరకు మాత్రమే భక్తులకు దర్శనాలు ఉంటాయని చెప్పారు.

వైజాగ్‌లో 'దాల్ లేక్'!

- బోటులో తిరుగుతూ షాపింగ్
- ముడసర్లోవలో ఏర్పాటుకు అధ్యయనం
- శ్రీనగర్ టూర్‌లో పరిశీలించిన మేయర్ బృందం



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ముడసర్లోవ రిజర్వాయర్‌లో బోటులో విహరిస్తూ కంబాలకొండ అందాలను తనివితీరా చూస్తూ కాఫీ తాగాలని ఉందా? అక్కడే నచ్చిన వాటిని కొనుగోలు చేసి ప్రకృతిని ఆస్వాదించాలని ఉందా? అచ్చంగా శ్రీనగర్‌లోని దాల్ లేక్ తరహాలో... ఇక్కడ పర్యాటకులను ఆకర్షించేందుకు...నగర వాసులకు ఆహ్లాదాన్ని అందించేందుకు గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) సమాయత్తమవుతోంది. తాజాగా జీవీఎంసీ అధ్యయన యాత్రలో భాగంగా శ్రీనగర్ మునిసిపల్ కార్పొరేషన్ పర్యటనలో 'దాల్ లేక్'ను పరిశీలించారు. పర్యాటకులకు ఆహ్లాదంతో పాటు ఆనందాన్ని పంచేందుకు వీలుగా దాల్ లేక్‌ను అభివృద్ధి చేశారు. బోటులో షికారు చేస్తూ... ఫ్యామిలీతో కలిసి అక్కడే భోజనం చేయడం, షాపింగ్ చేసేందుకు వీలుగా దీనిని అభివృద్ధి చేశారు. అదేతరహాలో ఇక్కడ ముడసర్లోవను అభివృద్ధి చేస్తే ఎలా ఉంటుందనే అంశంపై మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధికారులతో సమీక్షించారు. దీనిపై అధ్యయనం చేయాలని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆమె ఆదేశించారు. ప్రధానంగా నగర వాసులతో పాటు విశాఖకు విచ్చేసే పర్యాటకులను ఆకర్షించే విధంగా అభివృద్ధి చేయాలని సూచించారు.

ముడసర్లోవలో....!

వాస్తవానికి గతంలో జీ–20 సమావేశాల సందర్భంగా వచ్చిన ప్రపంచదేశాల అతిథుల బృందం ముడసర్లోవలో పర్యటించారు. అక్కడ ఏర్పాటు చేసిన నీటిపై తేలియాడే సౌర విద్యుత్ ప్లాంటు (ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్)ను పరిశీలించారు. ఇప్పటికే ముడసర్లోవ వివిధ రకాలుగా పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఈ రిజర్వాయర్ మొత్తం 62 ఎకరాల్లో విస్తరించి ఉంది. నగర ప్రజలకు మరింత ఆహ్లాదాన్ని పంచేందుకు నిరంతరం ప్రయత్నించడంలో భాగంగా దాల్ లేక్ తరహాలో ముడసర్లోవ లేక్‌ను అభివృద్ధి చేయాలని జీవీఎంసీ మేయర్ భావిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా దీనిపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని ఇంజినీర్స్ డే సందర్భంగా అధికారులను ఆదేశించారు. ప్రధానంగా రిజర్వాయర్ ఎంత లోతులో ఉన్నది? బోటింగ్ సమయంలో పర్యాటకులకు ఇబ్బంది లేకుండా ఏ విధంగా చర్యలు తీసుకోవాలి? ఎక్కడెక్కడ సేదతీరేందుకు షాపింగ్, హోటల్స్ వంటి సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంది? అనే అంశాలను పరిశీలించి నివేదిక రూపొందించాలని సూచించారు.



ముడసర్లోవలో ఉద్యానవనం అందాలు

ఇదీ దాల్ లేక్...

జమ్మూ, కశ్మీర్‌లో ఇది రెండో అతిపెద్ద సరస్సు. దీనిని ఫ్లవర్ లేక్, శ్రీనగర్ జ్యువెల్ అని కూడా పిలుస్తారు. 5 అడుగుల నుంచి 20 అడుగుల లోతుతో 18 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉండే ఈ లేక్‌లో బోటింగ్‌తో పాటు అక్కడ సేద తీరేందుకు రూమ్స్, భోజనం చేసేందుకు హోటల్స్ మాత్రమే కాకుండా షాపింగ్ చేసేందుకు షాపులు కూడా అందుబాటులో ఉన్నాయి. ఈ హోటల్స్, షాప్స్ కూడా బోట్ల మీదనే ఏర్పాటు చేయడంతో పాటు లేక్‌లోనే ఉండటం పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఒక వైపు మంచుకొండలు.. మరోవైపు సరస్సు అందాలను చూస్తూ బోటింగ్ చేయడం పర్యాటకులను కట్టిపడేస్తోంది. ఇదేతరహాలో ఇక్కడ ముడసర్లోవను అభివృద్ధి చేసే అవకాశం ఉందన్న అభిప్రాయం జీవీఎంసీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

అధ్యయనం చేయాలని ఆదేశించాం



శ్రీనగర్‌లో కార్పొరేటర్లతో కలిసి పర్యటించాం. అక్కడ నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను గమనించాం. అక్కడ 4 జోనల్ కార్యాలయాలు ఉన్నాయి. మనతో పోలిస్తే చిన్న ప్రాంతం. అయినప్పటికీ అక్కడ దాల్ లేక్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేశారు. అదేతరహాలో ఇక్కడ ముడసర్లోవలో అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉందని భావిస్తున్నాం. ఇదే విషయంపై అధ్యయనం చేయాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించాం. ఇప్పటికే నగరవాసులకు సౌకర్యాలను కల్పించడంలో జీవీఎంసీ ముందంజలో ఉంది.

– గొలగాని హరి వెంకటకుమారి, మేయర్

కలెక్టరేట్‌లో ఉద్యోగుల గ్రీవెన్స్



వినతులు స్వీకరిస్తున్న డీఆర్వో దయానిధి

తుమ్మపాల : కలెక్టరేట్‌లో ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. గ్రీవెన్స్ చేసుకునేందుకు ఆయా శాఖల ఉద్యోగుల వినతులను జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి స్వీకరించారు. వారి సమస్యలను ఆయా శాఖల అధికారుల ద్వారా పరిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమం జరుగుతుందన్నారు. గ్రీవెన్స్‌లో మొత్తం మూడు అర్జీలు నమోదయ్యాయి.

జిల్లా ఎస్పీ కార్యాలయంలో...

అనకాపల్లిటౌన్ : స్థానిక ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బందికి గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో ముగ్గురు పోలీస్ సిబ్బంది వారివారి అనారోగ్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలను తెలియజేయడం జరిగిందని ఎస్పీ కె.వి. మురళీకృష్ణ చెప్పారు. వివరాలను పరిశీలించి సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.



హెచ్‌సీ సమస్యను ఆలకిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

సమస్యల సత్వర పరిష్కారానికి జగనన్నకు చెబుదాం

- కోటవురట్ల మండలంలో వినతులు స్వీకరించిన కలెక్టర్, జిల్లా అధికారులు
- మొత్తం 159 అర్జీలు.. రెవెన్యూ అంశాలపైనే ఎక్కువ ఫిర్యాదులు

కోటవురట్ల: జిల్లా స్థాయి 'జగనన్నకు చెబుదాం (స్పందన)' కార్యక్రమాన్ని ప్రతి మండల కేంద్రంలో నిర్వహిస్తున్నామని, సమస్యల సత్వర పరిష్కారానికి ఇది మరింతగా దోహదపడుతుందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. శుక్రవారం ఆయన కోటవురట్లలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ జాహ్నవి, ఆర్డీవో జయరాం, ఏఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, డీఈవో వెంకటలక్ష్మమ్మ, డీఆర్‌డీఏ, ఐకేపీ అధికారులు, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి అర్జీలను స్వీకరించారు. మొత్తం 159 వినతులు రాగా వాటిలో 110 రెవెన్యూ సమస్యలున్నాయి. ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, భూసర్వే సమస్యలపై అర్జీలు అందాయి. కోటవురట్ల, రాట్నాలపాలెం గ్రామాల మధ్య గెడ్డ ఆక్రమణకు గురైందని తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. కోటవురట్లలో జగనన్నకాలనీలో 130 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారని, ఈ కాలనీకి వెళ్లేందుకు సరైన రోడ్డు సదుపాయం లేదని విన్నవించారు. పందూరు, జల్లూరు గ్రామాల్లో వరాహనదిపై వంతెనలు కూలిపోయాయని, కొత్తవి నిర్మించాలని ఆయా గ్రామాల వారు కలెక్టర్‌ను వినతి పత్రం ఇచ్చారు.



డ్వాక్రా సంఘాల కూరగాయల పెంపకానికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే



కోటవురట్లలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి

ఎమ్మెల్యే బాబూరావు వినతి

కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కలిసి, పలు సమస్యల గురించి చర్చించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తాగునీరు, రోడ్లు, విద్యుత్, జగనన్న కాలనీలో సమస్యలు, డ్రెయినేజీ సమస్యలు తన దృష్టికి వచ్చాయని, వీటిని పరిష్కరించాలని కోరారు. అర్హులైన వారు చాలామంది ఉన్నారని వారందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. వెలుగు పథకం ద్వారా డ్వాక్రా మహిళల కూరగాయల పెంపకం చేపట్టేందుకు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు.

గోకులం షెడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

గత టీడీపీ ప్రభుత్వం హయాంలో సుమారు 38 మంది గోకులం పథకం ద్వారా కంట్రిబ్యూషన్ చెల్లించి షెడ్లు నిర్మించుకున్నారని, వారందరికీ సుమారు రూ.30 లక్షలు విడుదల చేయాల్సి ఉందని రాజుపేట గ్రామ రైతులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. పలు గ్రామాల్లో ఇసుక గ్రావల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని టీడీపీ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

జేజేఎం పనుల్లో జాప్యంపై ఫిర్యాదు



మా గ్రామంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉంది. జల్‌జీవన్ మిషన్ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రభుత్వం మా గ్రామంలో ఇంటింటి కుళాయిల కోసం మూడేళ్ల క్రితం రూ.70 లక్షలు మంజూరు చేసింది. కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారులు కుమ్మక్కయి పనులు చేయడం లేదు. పలుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.

–జి.శ్రీనివాసరావు, ఉప సర్పంచ్, కె.వెంకటాపురం

దుగ్గాడ కాలువను ఆధునికీకరించాలి

దుగ్గాడ కాలువ ఆధునికీకరణ చేపట్టాలని జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదు చేశాను. ఈ కాలువ కింద సుమారు 2 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. కాలువను ఆధునికీకరించకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

–పెట్ల రాంబాబు, బీకేపల్లి

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పరిశీలన

స్పందన కార్యక్రమం ముగిశాక కలెక్టర్ తంగేడులో పాఠశాలను సందర్శించారు. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేని పరిశీలించారు. మండలంలో తంగేడు నుంచి ఈనెల 16వ తేదీన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఇంటింటికీ తిరిగి సర్వే చేయాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ సదుపాయం కల్పించామని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో ఈ ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలని, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించాలన్నారు.

క్లుప్తంగా

21న విమ్స్‌లో వైద్యుల పోస్టులకు ఇంటర్వ్యూలు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో వైద్యులు పోస్టులకు ఈనెల 21న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు శుక్రవారం తెలిపారు. 43 మంది సూపర్ స్పెషలిస్టులు, జనరల్ స్పెషలిస్టుల పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. సూపర్ స్పెషలిస్టు వైద్యులకు నెలకు రూ 1.60లక్షలు, జనరల్ స్పెషలిస్టు వైద్యులకు రూ. 92 వేలు వేతనం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 21న ఉదయం 10 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. ఏపీ మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారులు ఆధ్వర్యంలో ఈ ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలు కోసం dme.ap.nic.in అనే వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

బ్రైట్‌స్టార్-2023లో ఐఎన్ఎస్ సుమేధ



విన్యాసాల్లో పాల్గొన్న ఐఎన్ఎస్ సుమేధ

సింథియా: ఈజిప్టులోని పోర్ట్ అలెగ్జాండ్రియాలో జరిగిన బ్రైట్‌స్టార్ 2023 సైనిక వ్యాయామంలో భారత నౌకాదళానికి చెందిన నౌక ఐఎన్ఎస్ సుమేధ పాల్గొంది. సముద్ర భద్రతను పెంపొందించడం, ఇతర నౌకలతో స్నేహబంధాన్ని పెంపొందించడం, నౌకల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ వ్యాయామం జరిగిందని నేవీ అధికారులు తెలిపారు.

రోడ్లకు ఇరువైపులా మొక్కల పెంపకం

- ఎన్టీపీసీ నిధులతో ఎవెన్యూ ప్లాంటేషన్
- 24 కిలోమీటర్ల మేర రోడ్లలో ఏర్పాటు



పింద్రంగి-ముసిరాం మార్గంలో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను పరిశీలిస్తున్న విజయ్‌కుమార్

కె.కోటపాడు: కె.కోటపాడు, దేవరాపల్లి, కశింకోట మండలాల్లో ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా 24 కిలోమీటర్ల మేర రోడ్లకు ఇరువైపులా మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు అనకాపల్లి జిల్లా సామాజిక అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి సీహెచ్ విజయ్‌కుమార్ తెలిపారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో రోడ్లకు ఇరువైపులా నాటిన బాదం, కాము, తెల్లమద్ది, నల్లమద్ది తదితర మొక్కలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులతో ఈ మొక్కలను పెంచుతున్నట్లు తెలిపారు. మొక్కలు పెంచడం వలన పచ్చదనం, ప్రయాణీకులకు నీడ, పశుపక్ష్యాదులకు ఆవాసాలుగా మారి, పర్యావరణ సమతుల్యతకు దోహదపడుతుందన్నారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు సూచనల మేరకు కె.కోటపాడు మండలంలో పింద్రంగి-ముసిరాం, వై జంక్షన్-కొత్తభూమి, ఆనందపురం-కొరువాడ, లంకవానిపాలెం-కొరువాడ రోడ్డు మార్గంలో 8 కిలోమీటర్లు, దేవరాపల్లి మండలంలో అలమండ-బొడ్డువారి కళ్లాలు, తారువ-బొడ్డువారి కళ్లాలు, దేవరాపల్లి కళాశాల-చేనులపాలెం, పెదనందిపల్లి కాలనీ- దేవరాపల్లి కళాశాల, సంతపేట-చిననందిపల్లి, పెదనందిపల్లి-ఎ.కొత్తపల్లి గ్రామాల మధ్య 12 కిలో మీటర్ల మేర రోడ్లకు ఇరువైపులా మొక్కలను ఇప్పటికే నాటినట్లు పేర్కొన్నారు. కశింకోట మండలంలో పాత అచ్చెర్ల, కొత్త అచ్చెర్ల మార్గంలో 4 కిలోమీటర్ల మేర రోడ్లకు ఇరువైపులా ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా మొక్కలను నాటినట్లు తెలిపారు. వీటితో పాటు కశింకోట మండలం సంపతిపురంలో నాలుగున్నర ఎకరాల్లో 3,900 మొక్కలను బ్లాక్ ప్లాంటేషన్‌లో భాగంగా పెంచుతున్నట్లు వెల్లడించారు. మొక్కలను నాటడంతో పాటు, వాటి సంరక్షణకు పూర్తి జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట వనసేవకుడు చిరికి గోవింద ఉన్నారు.

టిడ్కో ఇళ్లు రానివారికి డిపాజిట్ల చెల్లింపు

- అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

యలమంచిలి: టిడ్కో ఇల్లు కేటాయించని దరఖాస్తుదారులకు, వారు చెల్లించిన డిపాజిట్ సొమ్మును తక్షణమే తిరిగి ఇచ్చేయాలని ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు(కన్నబాబు) అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తుదార్ల సొమ్ము చెల్లింపు ప్రక్రియలో అధికారుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరై రెండు మాసాలవుతున్నా దరఖాస్తుదారులకు డిపాజిట్‌ను ఎందుకు వాపస్ చేయలేదని మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావును, డీఈ వీరయ్యను ప్రశ్నించారు. దీనికి వారు సమాధానమిస్తూ టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల ఖాతాల విషయంలో సాంకేతిక సమస్యలు తలెత్తడం, గతంలో పనిచేసిన అధికారులు సక్రమంగా రికార్డులు నిర్వహించకపోవడం, కొన్ని రికార్డులు కనిపించకపోవడంతో సమస్య తలెత్తిందన్నారు. 68 మంది దరఖాస్తుదారుల పేర్లు, సమగ్ర వివరాలు సేకరించి, వారి డిపాజిట్ సొమ్మును చెల్లించేస్తామని తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో పనిచేసిన అధికారి తీరు వల్ల ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా, అధికారులు సకాలంలో పనులు పూర్తి చేయట్లేదని, దీంతో మున్సిపల్ మంత్రి ఆదిమూలపు సురేష్‌తో మాట్లాడి దరఖాస్తుదారుల డిపాజిట్ చెల్లింపులకు నిధులు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని ఆక్షేపించారు. వెంటనే మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించి, తీర్మానం చేసి, సొమ్మును చెల్లించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మంగళాపురం ఆనకట్టకు రూ.45 లక్షలు మంజూరు



దెబ్బతిన్న మంగళాపురం ఆనకట్ట



నిధులు మంజూరు చేసిన ఎంపీని సత్కరిస్తున్న సర్పంచ్‌లు,రైతులు

- ఎంపీ సత్యవతి, విప్ ధర్మశ్రీకి కృతజ్ఞతలు తెలిపిన రైతులు

బుచ్చెయ్యపేట : మండలంలోని మంగళాపురం ఆనకట్ట నిర్మాణానికి ప్రభుత్వం రూ.45 లక్షలు మంజూరు చేసింది. పది గ్రామాల రైతులకు సాగునీరు అందించాల్సిన ఆనకట్ట భారీ వర్షాలకు రెండేళ్ల క్రితం కొట్టుకు పోయి దెబ్బతింది. మంగళాపురం, కుముదాంపేట, విజయరామరాజుపేట, దిబ్బపాలెం, లక్ష్మీపురం తదితర గ్రామాలకు చెందిన సుమారు 3,500 ఎకరాలకు సాగునీరు అందడం లేదు. కోనాం రిజర్వాయర్ నీరు విడుదల చేసిన మంగళాపురం ఆనకట్ట దెబ్బతినడంతో నీరంతా దిగువకు పోయేది. రైతులకు సాగునీరు అందక పంటలు పండక రెండేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దృష్టికి నీటి సమస్యను తీసుకెళ్లారు. రెండు నెలల కిందట విప్ ధర్మశ్రీ ఇరిగేషన్ అధికారులతో కలిసి దెబ్బతిన్న మంగళాపురం ఆనకట్టను పరిశీలించి నిర్మాణానికి అంచనాలు తయారు చేయించారు. ఎంపీ నిధులు మంజూరు చేయించి ఆనకట్ట నిర్మాణం చేపట్టి రైతులందరికీ సాగునీరు అందేలా చేస్తానని విప్ ధర్మశ్రీ హామీ ఇచ్చారు. విప్ ధర్మశ్రీ ద్వారా ఎంపీ బి.వి. సత్యవతి రూ. 45 లక్షలు నిధులు మంజూరు చేశారు. దీంతో మంగళాపురం, విజయరామరాజుపేట సర్పంచ్‌లు కంటే పద్మరేఖ వెంకట్, ఎల్లపు విజయ్‌కుమార్, ఉప సర్పంచ్ జగ్గు, రైతు సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం ఎంపీని ఆమె నివాసంలో కలిసి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నిధులు మంజూరుకు కృషి చేసిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీకి, మండల నాయకులకు కూడా ధన్యవాదాలు తెలిపారు.

ఇంధన పొదుపులో జాతీయ పురస్కారం

కశింకోట: మండలంలోని బయ్యవరం వద్ద ఉన్న సాగర్ సిమెంట్ పరిశ్రమకు ఇంధన పొదుపులో వరుసగా నాలుగోసారి జాతీయ స్థాయిలో పురస్కారం లభించింది. ఈ మేరకు హైదరాబాద్‌లో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ప్రతినిధులు పురస్కారాన్ని గురువారం రాత్రి అందజేశారు. పరిశ్రమ సీనియర్ జనరల్ మేనేజర్ కె.శ్రీనివాసరావు, ఎలక్ట్రికల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ మేనేజర్ ఎస్.సతీష్, ప్రాసెస్ ఇన్‌ఛార్జి పీఎస్‌వీఎస్ నారాయణ పాల్గొని పురస్కారాన్ని అందుకున్నారు. పరిశ్రమల గ్రైండింగ్ విభాగంలో నిర్వహించిన ఎక్సలెన్స్ ఇన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్-2023 పోటీలో సీఐఐ ద్వారా ఎనర్జీ ఎఫిషియెంట్ యూనిట్‌లో ఈ ప్రతిష్టాత్మకమైన పురస్కారం పరిశ్రమకు లభించింది. దీంతో పరిశ్రమ ఉద్యోగులు, సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు.



సీఐఐ నుంచి జాతీయ పురస్కారం అందుకుంటున్న సాగర్ సిమెంట్స్ సీనియర్ జీఎం శ్రీనివాసరావు

స్వయంభూ విఘ్నేశ్వరుని ఉత్సవ పోస్టర్ల ఆవిష్కరణ

చోడవరం: చోడవరం శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి పుణ్యక్షేత్రంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన ప్రచార వాల్‌పోస్టర్లను ఆలయ ప్రాంగణంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ నెల 18 నుంచి 26 వరకు స్వామివారి క్షేత్రంలో ఉత్సవాలు జరిపేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. ఆలయ మాడవీధులకు రాజగోపురాలు నిర్మించడంతో ఈ ఏడాది ఉత్సవాలకు ఆలయం మరింత శోభాయమానంగా తయారైందని ధర్మశ్రీ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వీవీవీ సత్యనారాయణమూర్తి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పప్పల జయదేవ్, ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఉప్పల సతీష్, ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతిరావు, కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

సాంకేతిక ప్రగతితో అవకాశాలు

ఏయూక్యాంపస్: సాంకేతిక ప్రగతి నూతన అవకాశాలను సృష్టించే మార్గాలను చూపుతుందని ఏయు ఉపకులపతి ఆచార్య ప్రసాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఇంజినీర్స్ డే ని పురస్కరించుకుని సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన యాక్సిస్ 2కె 23 సింపోజియాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ అవకాశాల తలుపులు తెరుచుకుంటున్నాయని, వీటిని అందుకోవాల్సిన బాధ్యత నేటితరం యువతపై ఉందన్నారు. సాంకేతికత రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్న విధానం వివరించారు. సమాజ సమస్యలకు పరిష్కారాలను చూపేది ఇంజనీర్లేనని, నేటి సమాజంలో ప్రతి అంశం ఇంజనీరింగ్ తో ముడిపడి ఉందనే వాస్తవాన్ని మనందరం గమనించాలని సూచించారు. భవిష్యత్తును ప్రభావితం చేసే విధంగా నేటి తరం పనిచేయాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు. భవిష్యత్తుకు అవసరమైన ప్రణాళిక, సన్నద్ధత చేసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థి కుమార్ రాజా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.కుమార్ రాజా , ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి. శశిభూషణరావు కన్వీనర్ ఆచార్య సి.ఎస్.వి. సత్యనారాయణరెడ్డి, స్టూడెంట్ కోఆర్డినేటర్ పి. సాత్విక,డాక్టర్ కె.రాజశేఖర్, ఆచార్య ఎస్.కె యజ్ఞాని తదితరులు ప్రసంగించారు.



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఆసియన్ గేమ్స్‌కు సిద్ధమవుతున్న అథ్లెట్ జ్యోతి

విశాఖ స్పోర్ట్స్: ఆసియన్ గేమ్స్‌కు విశాఖ అథ్లెట్ భారత్ జట్టు తరఫున సిద్ధమవుతోంది. చైనాలోని హాంగ్జౌలో ఈ నెల 23 నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు పలు క్రీడాంశాల్లో పోటీలు జరగనున్నాయి. కరోనా కారణంగా వాయిదా పడిన ఈ పోటీలు తిరిగి షెడ్యూల్ కాగా.. ఆసియాలోని మేటి జట్లు పోటీకి సమాయత్తమవుతున్నాయి. భారత్ తరఫున 570 మంది అథ్లెట్లు 36 క్రీడాంశాల్లో పోటీపడేందుకు సిద్ధమవుతుండగా.. వంద మీటర్ల వుమెన్ హర్డిలర్ జ్యోతి ఈ గేమ్స్‌లో ఫాస్టెస్ట్ వుమెన్ హర్డిలర్‌గా నిలిచేందుకు తీవ్రంగా శ్రమిస్తోంది. ఇటీవల ముగిసిన ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తొలిసారిగా పాల్గొన్న జ్యోతి తొలి దశలోనే వెనుదిరగ్గా.. ఆసియన్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించింది.



అథ్లెట్ జ్యోతి

ఉత్సాహంగా హర్ ఘర్ ధ్యాన్

విశాఖ స్పోర్ట్స్: విశాఖ ఆర్ట్ ఆఫ్ లివింగ్ సహకారంతో ఈకో రైల్వే వాల్తేర్ ఆధ్వర్యంలో శుక్రవారం హర్‌ఘర్ ధ్యాన్ క్యాంపెయిన్ జరిగింది. ఉద్యోగులు, అధికారులకు ధ్యానం మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ భాగ్యశ్రీ.. శారీరక ఒత్తిడి రకాలు, ధ్యానం, ధ్యాస క్రియల ద్వారా వాటిని ఎలా అధిగమించాలో వివరించారు. ఏడీఆర్ఎంలు సుధీర్‌కుమార్, మనోజ్‌కుమార్ మాట్లాడుతూ దైనందిన జీవితంలో ఎదుర్కొనే ఒత్తిడితో కూడిన పరిస్థితులను అధిగమించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. సీనియర్ అధికారి రంజన్ మహంతి కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

న్యూ కోచ్ కేర్ సెంటర్‌లో డీఆర్ఎం తనిఖీలు



వందే భారత్ రైలు అండర్ గేర్ పార్ట్స్‌ను తనిఖీ చేస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్



వందే భారత్ ఎక్స్‌ప్రెస్ కోచ్ లోపల తనిఖీలు చేస్తున్న డీఆర్ఎం

తాటిచెట్లపాలెం: మర్రిపాలెంలోని న్యూ కోచ్ కేర్ సెంటర్‌లో శుక్రవారం డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ తనిఖీలు చేపట్టారు. కోచ్‌ల్లో పరిశుభ్రత, నిర్వహణ, భద్రత చర్యలపై ఆరా తీశారు. కోచ్ కేర్ సెంటర్‌లోని వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రేక్‌తో పాటు మరికొన్ని రేక్‌లను ఆయన పరిశీలించారు. ప్రయాణికుల ఫీడ్‌బ్యాక్‌ను బట్టి తీసుకోవాల్సిన చర్యలను అధికారులు, సిబ్బందికి వివరించారు. ఎల్‌హెచ్‌బీ కోచ్‌ల నిర్వహణ, అండర్ గేర్ పార్ట్స్, ఇన్‌సెక్ట్ నియంత్రణ అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీనియర్ కోచ్ డిపో ఆఫీసర్ ప్రవీణ్ భటి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం పూతరేకులకు భౌగోళిక గుర్తింపు



ఆత్రేయపురం పూతరేకుల సంఘానికి భౌగోళిక గుర్తింపు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న లా వర్సిటీ వీసీ శ్రీసుధ

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయంలోని మేధో సంపత్తి హక్కుల కేంద్రం(సీపీఆర్) కృషితో ఆత్రేయపురం పూతరేకులకు భౌగోళిక గుర్తింపు లభించిందని వర్సిటీ ఉపకులపతి ఆచార్య శ్రీసుధ వెల్లడించారు. రాష్ట్రంలోని సుమారు 30 రకాల ఉత్పత్తులను గుర్తించి వాటికి కూడా గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని.. ఇందులో భాగంగా మాడుగుల హల్వాకు గుర్తింపు తెచ్చేలా రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ డిపార్ట్‌మెంట్‌తో ఒప్పందం చేసుకున్నామన్నారు. సీపీఆర్ ఆధ్వర్యంలో వర్సిటీలో శుక్రవారం ఒక్క రోజు జాతీయ సదస్సు జరిగింది. మేధో సంపత్తి హక్కుల నిపుణుడు, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ ఆచార్యుడు ఉన్నత్ పి.పండిట్ వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ శ్రీసుధ మాట్లాడుతూ మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో స్థానిక ఉత్పత్తులు ఎంతో ప్రసిద్ధి చెందుతాయని.. వాటిని తయారు చేయడంలో ఆ ప్రాంత వాసులు ప్రత్యేక నైపుణ్యం కలిగి ఉంటారన్నారు. ఆ ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆచార్య ఉన్నత్ పి.పండిట్ మాట్లాడుతూ రాష్ట్రంలో 16 రకాల ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు లభించిందని, అందులో తిరుపతి లడ్డూ ఎంతో ప్రత్యేకమైనదన్నారు. భౌగోళిక చట్టం అమల్లోకి వచ్చిన రోజునే ఆత్రేయపురం పూతరేకులకు భౌగోళిక గుర్తింపు సర్టిఫికెట్‌ను ప్రదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. పూత రేకుల ఉత్పత్తిదారులు తమ గుర్తింపును కాపాడుకునేందుకు మరింత కృషి చేయాలని సూచించారు. భౌగోళిక గుర్తింపు సంస్థ ప్రతినిధి సంజయ్ గాంధీ మాట్లాడుతూ ప్రతి న్యాయ విద్యార్థి కనీసం మూడు నుంచి నాలుగు ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు తెచ్చే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం పూతరేకుల ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధులకు వీసీ గుర్తింపు సర్టిఫికెట్ అందజేశారు. మాడుగుల హల్వాకి భౌగోళిక గుర్తింపు తీసుకొచ్చేందుకు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ విభాగం ప్రతినిధి మారుతి, ఆత్రేయపురం పూతరేకుల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు రామరాజు, ప్రసాద రాజు, మోదకొండమ్మ తల్లి మాడుగుల హల్వా తయారీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో చారిత్రక ఘట్టం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ రాధాకృష్ణ, ఏఎంసీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మన్మథరావు

మహారాణిపేట: రాష్ట్రంలో ఒకే రోజు ఐదు మెడికల్ కాలేజీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించడం వైద్య రంగంలో చారిత్రక ఘట్టమని వైద్య విద్యార్థులు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం విజయనగరం వైద్య కళాశాలను ప్రత్యక్షంగా.. నంద్యాల, మచిలీపట్నం, ఏలూరు, రాజమహేంద్రవరం వైద్య కళాశాలలను వర్చువల్‌గా ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమానికి ఏఎంసీ ప్రాంగణం నుంచి వైద్య విద్యార్థులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. సీఎం ప్రసంగాన్ని తిలకించిన అనంతరం మాట్లాడారు. వైద్య ఆరోగ్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఎంతో విప్లవాత్మకంగా ఉన్నాయని, వైద్య విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, ఏఎంసీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మన్మథరావు, డాక్టర్ కృష్ణవేణి, పలు వైద్య విభాగాల హెచ్‌వోడీలు, వైద్యులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ల అధ్యయన యాత్రలో స్వల్ప ప్రమాదం

డాబాగార్డెన్స్: అధ్యయన యాత్రకు వెళ్లిన జీవీఎంసీ కార్పొరేటర్లకు ప్రమాదం తప్పింది. స్వల్ప ప్రమాదం కావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జీవీఎంసీ కార్పొరేటర్లు ఈ నెల 10న అధ్యయన యాత్రకు బయలుదేరారు. శుక్రవారం వారు ప్రయాణిస్తున్న బస్సు బ్రేకులు ఫెయిల్ కావడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఉదయం 8.30 గంటలకు కాట్రా నుంచి బయలుదేరి 40 కిలోమీటర్లు ప్రయాణించి జమ్ముకుడలి ఫ్లైఓవర్ సమీపానికి చేరుకున్నారు. ఈ క్రమంలో డ్రైవర్ బస్సు బ్రేకులు ఫెయిల్ అయినట్టు గుర్తించి, చాకచక్యంతో ఫుట్‌పాత్‌ను ఢీకొని నిలిపాడు. ఆ సమయంలో బస్సు నెమ్మదిగా నడపడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. వెంటనే బస్సుకు మరమ్మతులు చేపట్టారు. అయితే వేరే బస్సులో కార్పొరేటర్లు వెళ్లారు. ప్రమాద సమయంలో 30 మంది వైఎస్సార్ సీపీ, టీడీపీ కార్పొరేటర్లు ఉన్నారు. కాట్రా నుంచి 260 కిలోమీటర్ల దూరంలోని అమృత్‌సర్ వెళ్లి గోల్డెన్ టెంపుల్, ఇండో పాక్ వాఘా బోర్డర్, జలియన్‌వాలాబాగ్ ప్రాంతాలు సందర్శించాల్సి ఉండగా.. వాటిని రద్దు చేసుకున్నారు. రాత్రి 9.30 గంటలకు అమృత్‌సర్ చేరుకుని బస చేశారు.

క్లుప్తంగా

తులసీ వనవాసిగా గౌరీ పరమేశ్వరి అమ్మవారు



అనకాపల్లిటౌన్ : పట్టణంలో గవరపాలెం గౌరీ పంచాయతన దేవాలయంలో శుక్రవారం గౌరీపరమేశ్వరి అమ్మవారు తులసీ వనవాసిగా భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారిని మహిళలు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. గౌరీ అమృతవర్షిణి, గౌరీ గీతామహిళా మండలి భక్తులు వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసినాయుడు, కార్యదర్శి బుద్ద రమణాజీ, కోశాధికారి కర్రి శివ సూర్యనారాయణ, సభ్యులు లక్ష్మీనర్సింగరావు, బాలకృష్ణ, ఉమామహేశ్వరరావు, ఆలయ పురోహితుడు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

దివ్యాంగుల గుర్తింపు శిబిరం ఏర్పాటు ముదావహం



సమావేశంలో మాట్లాడుతున్న వీరుయాదవ్

అనకాపల్లిటౌన్ : ఎంపీ సత్యవతి దివ్యాంగుల గుర్తింపు శిబిరం ఏర్పాటు చేయనుండటం అభినందనీయమని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రుపల్లి వీరుయాదవ్ అన్నారు. సంఘ కార్యాలయంలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఈనెల 26, 27 తేదీల్లో స్థానిక రావుగోపాలరావు కళా క్షేత్రంలో నిర్వహించే శిబిరానికి జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో హాజరవుతారని చెప్పారు. దివ్యాంగులు కళాక్షేత్రం ముందు పిట్టగోడలు దాటుకుని లోపలికి ప్రవేశించడం కష్టమని, ఈ గోడలు తొలగించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

కశింకోట : కశింకోట శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడినట్లు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. రాజమండ్రి నుంచి విశాఖ వైపు ఇసుక తీసుకు వస్తున్న లారీని గ్రామ శివారులోని బంకు వద్ద అనకాపల్లి నుంచి యలమంచిలి వైపు వెళ్లే మార్గం నుంచి మలుపు దాటి వచ్చిన సిమెంట్ లోడ్ లారీ ఢీకొంది. దీంతో ఇసుక లారీ డ్రైవర్ శ్రీనుబాబు తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని విశాఖ కేజీహెచ్‌కు తరలించినట్లు, అక్కడ చికిత్స పొందుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనకాపల్లి సినిమాలు

ఛాంగురే బంగారురాజా	:	రాజా
మార్క్ ఆంటోని	:	సత్యనారాయణస్క్రీన్-1
ది నన్	:	సత్యనారాయణస్క్రీన్-2
మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి	:	షిర్డిసాయి
జవాన్	:	షిర్డిసాయి
జవాన్	:	వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	:	శ్రీసత్య
ఖుషి	:	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 323 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,310	4,460
రెండో రకం	4,160	4,210
మూడోరకం	4,000	4,150

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 26 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. 'ఎ' పాజిటివ్-4 యూనిట్లు, 'బి' పాజిటివ్-8 యూనిట్లు, 'బి' నెగెటివ్-2 యూనిట్లు, 'ఒ' పాజిటివ్ 10 యూనిట్లు, 'ఒ' నెగెటివ్-2 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు వైద్యుడు రాజుగురుబిక్షాజీని సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 387 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 355 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

ఉల్లాసంగా క్రీడా పోటీలు



క్రీడల ప్రారంభోత్సవం



వాలీబాల్ పోటీల నిర్వహణ



ఖో-ఖో క్రీడాకారులతో హెచ్‌ఎం సూర్యనారాయణ

కశింకోట : కశింకోటలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ఆహ్లాదకర వాతావరణంలో ప్రారంభమయ్యాయి. స్థానిక బాలికల హైస్కూల్లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న పోటీలను ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక వికాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయన్నారు. క్రీడల్లో రాణిస్తే చక్కటి ఉద్యోగాలు కూడా లభిస్తాయన్నారు. ముందుగా స్కూల్లోని సరస్వతీదేవి విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం 14 ఏళ్లలోపు, 17 ఏళ్లలోపు విభాగాల్లో విద్యార్థులకు వాలీబాల్, ఖో-ఖో, కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. 17 ఏళ్లలోపు బాలుర వాలీబాల్ పోటీలో కన్నూరుపాలెం, తాళ్లపాలెం హైస్కూళ్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. కబడ్డీలో కన్నూరుపాలెం హైస్కూలు, కశింకోట డీపీఎన్ హైస్కూలు, ఖో-ఖోలో కన్నూరుపాలెం హైస్కూలు, తాళ్లపాలెం గాయిత్రి స్కూలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. ఇక 14 ఏళ్లలోపు విభాగం వాలీబాల్‌లో డీపీఎన్ జెడ్పీ హైస్కూలు, తేగాడ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, కబడ్డీలో వెదురుపర్తి హైస్కూలు, కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూలు, ఖో-ఖోలో కన్నూరుపాలెం హైస్కూలు, నరసింగబిల్లి హైస్కూలు ప్రథమ, ద్వితీయ స్థానాలు గెలుచుకున్నాయి.

హెచ్‌ఎం ఎం.ఎస్. స్వర్ణకుమారి, వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని, పీడీలు పెంటకోట కమల, వి. ప్రభాకరరావు, విద్యా కమిటీ అధ్యక్షుడు యల్లపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గవరపాలెం జీవీఎంసీ చిన్న హైస్కూల్లో..

అనకాపల్లిటౌన్ : గవరపాలెం జీవీఎంసీ చిన్న హైస్కూల్లో మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు శుక్రవారం జరిగాయి. హైస్కూల్ హెచ్‌ఎం ఎ.సూర్యనారాయణ ఖో-ఖో, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ మండల కో ఆర్డినేటర్ కె.ఎం.నాయుడు, హైస్కూల్ ఎన్‌సీసీ అధికారి కె.జనార్దన్, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌క్రీడామైదానంలో..

స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో శనివారం బాల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ మండల కో ఆర్డినేటర్ కె.ఎం.నాయుడు శుక్రవారం చెప్పారు.

మట్టి వినాయకుడినే పూజిద్దాం



వినాయక ప్రతిమలు, వ్రతకల్ప పుస్తకాలు ప్రదర్శిస్తున్న దాడి రత్నాకర్ తదితరులు



మట్టి వినాయక ప్రతిమలతో కశింకోట డీపీఎన్ హైస్కూల్ విద్యార్థులు

అనకాపల్లిటౌన్ : మట్టి వినాయకులనే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడదాం.. అనే నినాదంతో 16వ తేదీన పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉచితంగా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక డైట్ కళాశాల ఆవరణలో శుక్రవారం మట్టి వినాయకులు, వినాయక వ్రతకల్ప పుస్తకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలగకుండా మట్టి వినాయకులను పూజించటమే మంచిదన్నారు. అలా చేస్తే ఆ విగ్రహాలను ఇంట్లోనే ఏదో ఒక పూల కుండీలో నిమజ్జనం చేయవచ్చన్నారు. మండలంలో మారేడుపూడి, అక్కిరెడ్డిపాలెం గ్రామాల్లోను, పట్టణంలో పెద్ద నాలుగురోడ్ల జంక్షన్, గవరపాలెం అగ్గి మర్రిచెట్టు, సంతబయలు, కశింకోటలో ఉచితంగా వినాయక ప్రతిమల పంపిణీ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ సుధీర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో..

కశింకోట : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం.ఆర్.వి.అప్పారావు కోరారు. శుక్రవారం 600 మంది విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణకు దోహదపడే మట్టి వినాయక ప్రతిమలను 'స్పందించే హృదయం' సంస్థ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి వినాయక ప్రతిమలు పర్యావరణ పరిరక్షణకు ఉపకరిస్తాయన్నారు. సంస్థ ఉపాధ్యాయుడు ఆచంట నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినియోగించి తయారు చేసిన వినాయక ప్రతిమలు, విగ్రహాలు పర్యావరణానికి హాని కలిగిస్తాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆచంట రవి, ప్రభాకర్, శర్మ, అప్పారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం



అప్పారావు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేస్తున్న పూర్ణచంద్రరావు, వెంకటేశ్వరరావు

అనకాపల్లిటౌన్ : రహదారి ప్రమాదంలో మృతి చెందిన నాతవరం పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కె.అప్పారావు కుటుంబానికి 1990 పోలీస్ కానిస్టేబుల్స్ బ్యాచ్‌మేట్స్ రూ.60 వేల ఆర్థిక సహాయం శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా బ్యాచ్‌మేట్స్ అనిల్, సుబ్బరాజు, నాయుడు, రమేష్, సింహాచలం, పూర్ణచంద్రరావు, బాబూరావు, రఘు, వెంకటేశ్వరరావు, మిలిటరీ నాయుడు మాట్లాడుతూ విశాఖ ఉమ్మడి రూరల్ జిల్లాలో స్వర్గీయ కె.అప్పారావు భీమిలి, పాయకరావుపేట పోలీస్ స్టేషన్లలో స్పెషల్ బ్రాంచ్‌లోను, రైల్వే జీఆర్‌పీలోను విధులు నిర్వహించారన్నారు. తర్వాత నాతవరం పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తు ఈ ఏడాది ఆగస్టు 25న రోడ్డు ప్రమాదంలో మృతి చెందారన్నారు.

నూకాంబిక అమ్మవారి హుండీ లెక్కింపు నేడు

అనకాపల్లిటౌన్ : స్థానిక నూకాంబిక ఆలయంలో శనివారం హుండీ లెక్కింపు కార్యక్రమం చేపడుతున్నట్లు ఆలయ ఈవో బండారు ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ఆవరణలో ఉదయం 7 గంటలకు హుండీ లెక్కించనున్నామని, ఈ కార్యక్రమానికి హాజరయ్యేవారు పంచె, కండువా ధరించాలని ఆయన కోరారు.

నూకాంబిక అమ్మవారికి అమావాస్య పూజలు



నూకాంబిక అమ్మవారికి ఉపారం తీసుకెళ్తున్న చైర్మన్ మురళీకృష్ణ, ఈవో ప్రసాద్

అనకాపల్లిటౌన్ : స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి దేవాలయంలో శుక్రవారం ఆదిబాబు అమావాస్య యూత్ ఆధ్వర్యంలో అమ్మవారికి అమావాస్య పూజలు జరిగాయి. అడిగర్ల శ్రీనివాసరావు కనకమహాలక్ష్మి దంపతులు, కొంతమంది భక్తుల సహకారంలో సుమారు ఆరువందల మంది భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం అమావాస్య పూజలను పురస్కరించుకుని ప్రముఖ వ్యాపారవేత్త, షణ్ముఖ స్వీట్స్ అధినేత కంభంపాటి భాను దంపతులు బూరెలు, వడలు, పులిహోర, పరమాన్నం, పెరుగు గారెలు, అరిసెలు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారి నిత్యాన్నదాన పథకానికి వ్యాపారవేత్త కొల్లూరు సూర్యకిరణ్, శివానీ దంపతులు రూ.13,800 దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్‌కు అందజేశారు. అనంతరం అమావాస్య యూత్ కమిటీ సభ్యులు చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకుడు దాడి జయవీర్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఆడారి ఉమా శ్రీనివాసరావు, పీలా లక్ష్మీ శ్రీనివాసరావు, కొందూరి రవీంద్రనాథ్, గొల్లవిల్లి నర్సింగరావు, పాము అనురాధ సన్నిబాబు, మళ్లవరపు ఈశ్వరరావు, యనమంద్ర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



కొప్పాక హైస్కూల్ విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న జెడ్పీ వెంకటరమణ

అనకాపల్లిటౌన్ : విద్యార్థి దశ నుంచే పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని జెడ్పీ ఎస్.వెంకటరమణ అన్నారు. జీవీఎంసీ విలీన గ్రామమైన కొండకొప్పాక జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం ఫ్రైడే- డ్రైడే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షా కాలం కావడంతో వివిధ రకాల వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు. ఇళ్లలోని పూలకుండీల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమకాట్ల వల్ల డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. భోజన సమయంలో చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవోహెచ్ దొర, హెచ్‌ఎం ఎస్ఎస్ రవికుమార్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ అప్పారావు, మలేరియా విభాగం ఇన్స్‌పెక్టర్ సీహెచ్ గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ఉదయం 9 గంటలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్ తెలిపారు. అగనంపూడి వద్ద ఉన్న ప్రభుత్వ హోమిబాబా క్యాన్సర్ ఆస్పత్రి నుంచి వైద్య సిబ్బంది బృందం వచ్చి పరీక్షలు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

రీ సర్వేతో రైతులకు మేలు



రైతులకు రీసర్వే పాసు పుస్తకాలు అందజేస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి రూరల్ : వందేళ్ల తర్వాత చేపడుతున్న భూముల రీసర్వేతో రైతులకు ఎంతో మేలని ఎంపీపీ గొర్లి సూరిబాబు అభిప్రాయపడ్డారు. శుక్రవారం మండలంలోని ఊడేరు సచివాలయం పరిధిలో జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష కార్యక్రమంలో భూముల రీసర్వే పూర్తయిన రైతులకు కొత్తగా మంజూరైన పట్టాదారు పాసు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల రీసర్వే చేపట్టాలన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం ఎంతో దూరదృష్టితో తీసుకున్నదిగా తెలిపారు. అనంతరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, ఎంపీపీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. గ్రామంలో వెల్‌నెస్ కేంద్రం భవన నిర్మాణ పనులు ఎంత వరకూ పూర్తయ్యాయో పంచాయతీరాజ్ ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఊడేరు సర్పంచ్ సిరిగిశెట్టి మోహన్, వెంకుపాలెం ఎంపీటీసీ సభ్యుడు రాపేటి వెంకటేష్, పంచాయతీరాజ్ డీఈఈ జె. వేణుగోపాల్, మండల ఏఈ కుమార్ రాజా, వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దాడ రామ్ శంకర్, సకల సంతోష్, సచివాలయ కన్వీనర్లు, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మపాలెం ఉప సర్పంచ్ నూకమ్మ మృతి



అనారోగ్యంతో మృతి చెందిన నూకమ్మ (ఫైల్)

పరవాడ : ముత్యాలమ్మపాలెం గ్రామ ఉప సర్పంచ్ సూరాడ నూకమ్మ (40) అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో మృతి చెందారు. ఐదు రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్న నూకమ్మను చికిత్స నిమిత్తం నగరంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. నూకమ్మకు ఇద్దరు సంతానం. భర్త పెంటయ్య ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నాడు. నూకమ్మ అంత్యక్రియలు శనివారం నిర్వహించడానికి కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉప సర్పంచ్ నూకమ్మ మృతికి సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు, వార్డు సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు సీహెచ్ అమ్మోరు, సూరాడ ముత్యాలరావు, పలువురు నాయకులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

సేవా కార్యక్రమాలకు ప్రణాళిక

అనకాపల్లిటౌన్ : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు విశాఖ ఉమ్మడి జిల్లా ప్రాథమిక విద్య అక్షరాస్యత కన్వీనర్ బుద్ద రమణాజీ తెలిపారు. స్థానిక న్యూకాలనీ రోటరీ హాల్లో గురువారం రాత్రి క్లబ్ సభ్యులతో సమావేశం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సమస్యలు తెలుసుకుని చదువుకోవటానికి కావలసిన ఏర్పాట్లు, పోలియో నిర్మూలన, సేవా కార్యక్రమాలు తదితర అంశాలపై క్లబ్ చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక రోటరీ క్లబ్ అధ్యక్షుడు పీజే నాయుడు, కార్యదర్శి ఆడారి రామకృష్ణ, క్లబ్ సీనియర్ సభ్యుడు కె.వి. గౌరీపతి, సభ్యులు బీఎస్ గుప్తా, కేఎల్ఆర్ కుమార్, సానా త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'స్వచ్ఛతా పక్వాడా'

చోడవరం రూరల్: మండలంలోని గవరవరం జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం 'స్వచ్ఛతా పక్వాడా' ముగింపు కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.జె.సుందర్‌సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పక్షం రోజుల పాటు జరిగిన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పలు రకాల పోటీలలో విజేతలకు సైన్సు టీచర్ ఏఎస్ కృప బహుమతులు అందించారు. ముగింపు రోజున విద్యార్థులతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించి, మొక్కలు నాటించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, మంచినీటి సద్వినియోగం, ప్లాస్టిక్ నిషేధంపై ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శన ఆకట్టుకుంది.

ముస్తాబవుతున్న గణనాథులు

- ఉత్సవ నిర్వాహకుల నుంచి ఆర్డర్ల వెల్లువ
- ఇప్పటికే సగానికి పైగా విగ్రహాల అమ్మకం



తుమ్మపాలలో విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్న తయారీదారులు

అనకాపల్లి రూరల్ : గణనాథుడి పండగ మరో రెండ్రోజుల్లో రానుంది. ఇప్పటికే మండపాల ఏర్పాటులో అందరూ బిజీగా గడుపుతున్నారు. విగ్రహాల తయారీ ఊపందుకుంది. అనకాపల్లి పట్టణం, మండలంలో రెండు నెలల ముందు నుంచే కళాకారులు విగ్రహాల తయారీ ప్రారంభించారు. తుమ్మపాలలో రెండు చోట్ల, పట్టణంలోని బస్‌కాంప్లెక్స్ సమీపంలో, రింగురోడ్డు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక స్థావరాలు ఏర్పాటు చేసుకుని విగ్రహాల తయారీ చేపడుతున్నారు. విగ్రహాల అమ్మకాల స్థావరాల వద్ద కొనుగోలుదారులతో రద్దీ కనిపిస్తోంది. హైదరాబాద్ నుంచి వివిధ రకాల ఆకర్షణీయమైన భిన్న రకాల అచ్చులను తెచ్చుకుని ప్రతిమలను తయారు చేస్తున్నారు. తుమ్మపాల ప్రధాన రహదారి పక్కన స్థానిక తయారీదారులతో పాటు రాజస్థాన్ నుంచి వచ్చిన తయారీదారులు కూడా విగ్రహాలు తయారు చేసి విక్రయిస్తున్నారు. అడుగు ఎత్తు నుంచి 12 అడుగుల వరకూ విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. వీటి ధర రూ. 2 వేల నుంచి రూ. 25 వేల వరకు ఉంది. ఇక్కడి నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు, ముఖ్యంగా సామర్లకోట, పెద్దాపురం, గోకవరం తదితర ప్రాంతాలకు విగ్రహాలను ఎగుమతి చేస్తున్నారు. గతంలో ప్రధాన సెంటర్లలో గణపతి విగ్రహాలు ఏర్పాటు చేసేవారు. నేడు యువత ఉత్సవాలపై ఎక్కువ ఉత్సాహం చూపిస్తుండడంతో ప్రతి సెంటర్‌లో విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. అనకాపల్లిలో ఏటా సుమారు అన్ని తయారీ కేంద్రాల వద్ద కలిపి 1000 నుంచి 1400 వరకూ విగ్రహాలను విక్రయిస్తుంటారు.

మట్టి విగ్రహాలపై ఆసక్తి

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు వినియోగించడం వలన వాతావరణం కలుషితం అవుతోంది. దీంతో కొన్నేళ్లుగా మట్టి వినాయక విగ్రహాల వినియోగం క్రమంగా పెరుగుతోంది. అధికార యంత్రాంగం, ఎన్జీవో సంస్థలు, సాక్షి మీడియా సంస్థలు సైతం మట్టి విగ్రహాలకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయి.

సాక్షి పత్రిక ఆధ్వర్యంలో పలు విద్యా సంస్థలు, ఆలయాల వద్ద మట్టి విగ్రహాల తయారీపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గం పరిశీలకుడు దాడి రత్నాకర్ పట్టణంలో పలుచోట్ల మట్టి విగ్రహాలను పెద్ద సంఖ్యలో పంపిణీ చేసి వాటి ప్రాధాన్యతను చాటారు.

ఇప్పుడిప్పుడే అమ్మకాలు ఊపందుకుంటున్నాయి..



ఇప్పుడిప్పుడే విగ్రహాల అమ్మకాలు ఊపందుకుంటున్నాయి. ముడిసరుకు, రంగులు, కూలీ ధరలు గతం కంటే విపరీతంగా పెరిగిపోయాయి. కానీ విగ్రహాల ధరలు మాత్రం ఆ స్థాయిలో పెరగలేదు. అయినప్పటికీ ఈ పని తప్ప వేరే పని మాకు రాదు. అందుకే కష్టమైనా బొమ్మల తయారీ కొనసాగిస్తున్నాం.

– బొలిశెట్టి కుమార్, విగ్రహాల తయారీదారు,తుమ్మపాల

15 ఏళ్ల అనుభవం..



విగ్రహాల తయారీలో 15 ఏళ్ల అనుభవం ఉంది. ఏటా ఈ ప్రాంతంలో విగ్రహాలు తయారు చేస్తుంటాం. మా వద్ద కూలీలకు రోజుకు రూ. 500 నుంచి రూ. 600 వరకు ఇస్తున్నాం. ఈ ఏడాది ఇప్పటి వరకు 200 విగ్రహాలు తయారు చేశాం. ఇప్పటికే సగానికి పైగా అమ్ముడుపోయాయి.

– జామి కుమార్, తుమ్మపాల

కెరీర్ గైడెన్స్‌తో పోటీ పరీక్షల్లో రాణింపు



విద్యార్థులతో మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ గోపాలరావు

నర్సీపట్నం: ఇంటర్మీడియట్ స్థాయిలోనే ఉపాధికి బాటలు వేసుకోవాలని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ ఎ.గోపాలరావు విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్లబ్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్, కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలను దత్తత తీసుకుని క్లబ్ ద్వారా అనేక సదుపాయాలు కల్పించామన్నారు. డిజిటల్ గ్రంథాలయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. చదువుతో పాటు ఏదో ఒకరంగంలో విద్యార్థులు శిక్షణ తీసుకుంటే కళాశాల విద్య పూర్తి చేసుకున్న వెంటనే ఉపాధి పొందే అవకాశం ఉంటుందన్నారు. పోటీ పరీక్షల్లో రాణించాలంటే విద్యార్థులు కెరీర్ గైడెన్స్‌పై పట్టుసాధించాలన్నారు.

కార్యక్రమంలో మాజీ గవర్నర్ డి.రాఘవేంద్రరావు, కళాశాల ప్రిన్సిపాల్ జి.చిన్నారావు, క్లబ్ ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.